


# ఆడదంటే!?...

"ఎంత టైం పడుతుంది?"

"ఒక్క పది నిమిషాలు చాలు మేడమ్"

ట్రబులిచ్చిన కారుని రిపేరు చేస్తూ వినయంగా జవాబిచ్చాడు డ్రైవర్. అంకిత విసుగ్గా చుట్టు ప్రక్కల గమనించసాగింది. చాలా పల్లెటూరు అది. వాళ్ళ కారు ఆగిన రోడ్డుకి కొంచెం దూరంలో చిన్నచిన్న గుడిసెలు కనబడుతున్నాయి. ప్రతి గుడిసె ముందు రెండు మూడు గేదెలు కట్టేసి వున్నాయి.

హఠాత్తుగా అంకిత దృష్టి తన ఎదురుగా వున్న చెట్టు కింద కూర్చుని వాదులాడుకుంటున్న ఇద్దరు వ్యక్తులపై పడింది. పల్లెటూరివాళ్ళని చూడగానే తెలిసిపోతోంది. పైగా కొంచెం తాగినట్టు కూడా వున్నారు. మాట తడబడుతోంది. అంకిత మనసులోనే 'టైం పాస్' అనుకుంటూ వాళ్ళవైపు చూడసాగింది.

"ఆ రంగడివాడ్కి బర్రెకోసం నేన్నిన్న అడ్వాన్సు ఇచ్చొస్తే నువ్వు ఈ రోజెల్లి ఇంకో వంద పెంచుతా నాకిస్తావా అంటావురా ఆడంగి యెధవా! ఇట్టాంటి ఆడదాని బేరాలు నా దగ్గర సాగవు. మొగోడిలా సెయ్యాల యేది సేసినా ఆ..." మొదటి వ్యక్తి అరుస్తున్నాడు.

"సీ... యెవరిదిరా ఆడదానిబేరం? నువ్వే ఆడంగల యెధవ్వి. నేను మొగోడిలా ఇంకో వంద పెంచుతానన్నా... మొగోడివైతే నువ్వూ పెంచు ఇంకో వంద. అంతేగాని ఇట్టా ఆడదాన్లా గిల్లి కజ్జాలకి దిగుతావేందిరా... యెధవన్నర యెధవ" రెండో వ్యక్తి అంతకంటే పెద్దగా అరుస్తున్నాడు.

"కంట్రీ బ్రూట్స్! తిట్టుకుంటే ఇద్దరూ తిట్టుకోక మధ్యలో ఆ 'ఆడది' అన్న మాటెందుకు? అదొక తిట్టైపోయింది! ఇలాంటి పల్లెటూరి వెధవల నుండీ హైసొసైటీ పెద్ద మనుషుల వరకూ అందరికీ ఆడదంటే చులకనే!' అనుకుంది.

లక్షల టర్నోవర్‌గల పెద్ద కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ అయివుండి, కొమ్ములు తిరిగిన మగవారితో బిజినెస్‌లో పోటీ పడుతూ, వారిమీదే గెలుపు సాధించి ఒప్పించుకునే అంకిత... వాళ్ళ మాటలు వింటూ ఇక ఆవేశాన్ని ఆపుకోలేక పోయింది.

వేగంగా అడుగు ముందుకి వేయబోయేంతలో హఠాత్తుగా ఓ దృశ్యం ఆమె కంటబడింది.

దూరంగా వున్న గుడిసెల్లోంచి ఇద్దరాడవాళ్ళు పరుగుపరుగున ఆ వ్యక్తుల దగ్గరకు వస్తున్నారు. ఆగిపోయి చూడసాగింది అంకిత. ఆ ఆడవాళ్ళు వీళ్ళ భార్యలు కాబోలు పాపం. ఆమె ఆలోచిస్తోంది. హఠాత్తుగా ఆలోచన చెదిరి పోయింది.



"లేరా యెదవ సచ్చినోడ! పొద్దుగాల తప్ప తాగొచ్చి వూరెంబడి తిరుగుతావుంటే కంచంలోకి బువ్వెట్టా స్తాదనుకున్నావురా" ఒకామె ఒక వ్యక్తి జుట్టు పట్టుకుని లాగుతోంది.

మరొకామె ఇంకో వ్యక్తి వీపుపై గుద్దుతూ "పైసా సంపాదన లేదుగాని పెద్ద మొనగాడిలా వంద రూపాయిలు ఎక్కువబెట్టి బర్రెను గొంటావురా నీ మొహానికి! ఇంట్లకెల్లి తీస్కెళ్లిన డబ్బులు ఏం జేసినావురా సన్నాసి నాయాలా" అంటూ గద్దించి అడుగుతోంది.

అంకిత ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే "ఎక్కండి మేడమ్" అన్నాడు డ్రైవర్, డోర్ తెరుస్తూ.

—వడ్లమూడి దుర్గాంబ

